సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 30 | జనవరి | 2024



ఎవరిని వరించేనో?

టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు నోటిఫికేషన్ రూపొందించాలని ప్రభుత్వం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది. - 8లో



'కత్తెర'కాటు..

మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించి అపారనష్టం కలుగజేస్తోంది. దీనిపై సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29⁰ /18⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించడానికి మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని వరంగల్–1 డిపో నుంచి ఉదయం 11 నుంచి 12 గంటలకు వరకు ప్రయాణికులకు ఫోన్‌లో అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్, నిజమాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు 9959 226047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు తెలపాలని కోరారు.

వేయిస్తంభాల గుడిలో పూజలు



హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల గుడిలో సోమవారం సంకట హర చతుర్థి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రభాత పూజ, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు.కాగా కమెడియన్, సినీ నటుడు రవికుమార్ (బిత్తిరి సత్తి) దంపతులు ఆలయాన్ని సందర్శించి గణపతికి పూజలు చేశారు. ఈ సందర్భంగా బిత్తిరి సత్తి మాట్లాడుతూ.. పలుమార్లు వరంగల్‌కు వచ్చాను కానీ, వేయిస్తంభాల దేవాలయాన్ని సందర్శించలేదని, శిల్పకళ అద్భుతమని, ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని అన్నారు.

ఎస్సై అనిల్ ఏఆర్‌కు అటాచ్

వరంగల్ క్రైం: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.అనిల్‌ను ఏఆర్‌కు అటాచ్ చేస్తూ సోమవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. తనను వేధిస్తున్నాడని, తనను కులం పేరుతో దూషించినట్లు అనిల్‌పై ఇటీవల సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటితో పాటు ఇతర సెక్షన్‌ల కింద కేసు నమోదైంది. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి శాఖపరమైన చర్యల్లో భాగంగా ఏఆర్‌కు అటాచ్ చేశారు.

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్లకు చివరి గడువు 31

దేశాయిపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2023–24 విద్యాసంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్లకు ఈనెల 31వ తేదీ చివరి గడువు అని దేశాయిపేట సీకేఎం ప్రభుత్వ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డా.ఏ.ధర్మారెడ్డి, ప్రిన్సిపాల్ డా.జి.శశిధర్‌రావులు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇంటర్ లేదా ఓపెన్ ఇంటర్, రెండు సంవత్సరాల ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి ఆసక్తి కలిగిన వారు జనవరి 31 వ తేదీ లోపు braouonline.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్లతో సహాయ కేంద్రానికి వచ్చి వెరిఫికేషన్ చేసుకోవాలని, నిర్ధారించిన ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి అడ్మిషన్ పొందాలని తెలిపారు. రెండవ, మూడవ సంవత్సరం ట్యూషన్ ఫీజు చెల్లించే వారు కూడా ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు సహాయ కేంద్రంలో, 73829 29618 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నాలా ఆక్రమణల కూల్చివేత



ఖిలా వరంగల్ : వరంగల్ శివనగర్‌లోని ఎస్సీ హాస్టల్ లేన్‌లో ఓ వ్యక్తి ప్రధాన నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. కాగా మాజీ కార్పొరేటర్ భర్త శామంతుల శ్రీనివాస్ నగరపాలక సంస్థ కమిషనర్ రిజ్వాన్ బాషాకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన కమిషనర్ వెంటనే అధికారులను నాలాల పరిశీలనకు పంపించారు. అధికారులు నివేదిక ప్రకారం సోమవారం బల్దియా అధికారులు పొక్లెయినర్‌తో చేరుకున్నారు. నాలాపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. నాలాల ఆక్రమణతోనే శివనగర్ చిన్నపాటి వర్షానికి ముంపునకు గురై ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితి వస్తోందని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, జవాన్లు పాల్గొన్నారు

గ్రేటర్‌లో జోన్ జగడం



గోపాలపూర్‌లో ఓ వ్యక్తి 2012లో 200 గజాల ప్లాట్ కొన్నాడు. ఆ తర్వాత అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)లో భాగంగా 2016లో రెసిడెన్షి జోన్ కింద కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఎల్ఆర్ఎస్ ఫైనల్ ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఆ రూపేణా చార్జీలు కూడా వసూలు చేసింది. ఇటీవల ఇంటి నిర్మాణం కోసం భూమిపత్రాలతోపాటు ఎల్ఆర్ఎస్ జతపరిచి మునిసిపల్ కార్పొరేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే 'మీ ప్లాట్ పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్'లో ఉందంటూ తిరస్కరించారు. ఆ జోన్‌లో ప్రజాపయోగం ఉపయోగపడే సంస్థలకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపింది. -సాక్షి, వరంగల్

వరంగల్ కుడా మాస్టర్ ప్లాన్ 2041లో మారిన జోన్‌లు

- నివాస సముదాయాలు ఇతర జోన్లుగా మార్పిడి
- ఇంటి నిర్మాణ అనుమతులకు ఇబ్బందులు
- 2016 ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్ ఇచ్చిన ప్లాట్లకు సైతం ఇదే నిబంధన
- ఇప్పటికే రోడ్ల విషయంలో మాస్టర్ ప్లాన్–2041 అమలు
- జోన్‌ల అమలుపై అధికారిక ఆదేశాలపై అధికారుల్లోనూ నిశ్శబ్దం
- తాజాగా హెచ్ఎండీఏ ప్లానింగ్ మాజీ డైరెక్టర్ అరెస్టులోనూ సీఎల్‌యూ అంశం
- ఇక్కడా ఏమైనా జరిగాయన్న దానిపై అంతర్గత విచారణ

..ఇదొక్కటే కాదు. మాస్టర్ ప్లాన్ 2041లో జోన్‌ల పేరుతో చాలామంది దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేదో ఎల్ఆర్ఎస్ క్లియర్ చేసే సమయంలోనే తిరస్కరించి ఉంటే సర్కార్‌కు అప్పుడు కట్టిన రూ.వేల ఫీజు అయినా మిగిలి ఉండేదని వాపోతున్నారు. అప్పుడు నివాసానికి పనికి వచ్చేదంటూ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) క్లియర్ చేస్తే, ఇప్పుడు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు రెసిడెన్షియల్ జోన్‌లో లేవంటూ కొన్ని దరఖాస్తులను తిరస్కరిస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అదే సమయంలో భారీ వైశాల్యంలో ఉన్న కొన్ని ప్లాట్ల దరఖాస్తుదారులకు మాత్రం 'మామూలు'గా చూసుకుంటే భూ వినియోగ మార్పిడి(ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్) కింద క్లియర్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాన్యులకు ఒకలా, బడా మనుషులకు మరొకలా మునిసిపల్ అధికారులు నిబంధనలు అమలుచేస్తుండడంతో అవినీతి అంశం చర్చకు వస్తోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)లోనూ సీఎల్‌యూ కింద భారీ మొత్తంలో ముడుపులు మారినట్టు ఇప్పటికే అవినీతి నిరోధక శాఖ విభాగాధికారులు మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివ బాలకృష్ణను అరెస్టు చేసిన అంశం పెద్ద చర్చకు వచ్చినట్టు తెలిసిందే. ఈ విధంగానే గ్రేటర్ వరంగల్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిబంధనలు అతిక్రమించి ఏమైనా జోన్‌ల మార్పు జరిగిందన్న దానిపై పురపాలక శాఖ అంతర్గత విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

రోడ్డుకే ఓకే...జోన్ అమలుపై లేని స్పష్టత...

1972 నాటి మాస్టర్ ప్లాన్‌ను సవరిస్తూ...నగరం 1,801 చదరపు కిలోమీటర్లకు పెరగడంతో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ 2041ను లీ అసోసియేట్‌తో కలిసి 'కుడా' రూపొందించింది. ఈ మాస్టర్ ప్లాన్ 2041లో పేర్కొన్న విధంగా 30 ఫీట్లు, 60 ఫీట్లు, 100 ఫీట్లు, 150 ఫీట్లు...ఇలా రోడ్ల ప్రాంతాన్ని వదిలి అనుమతి ఇవ్వాలని 2022 మార్చి 17న అప్పటి పురపాలక విభాగ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. అదే సమయంలో జోన్‌ల విషయంలో మాత్రం ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో దరఖాస్తుదారులు అధికారులను అడిగినా చాలావరకు పనులు కాకుండా నిలిచాయి. కొందరి విషయంలో మాత్రం 'మీ జోన్ రెసిడెన్షియల్ జోన్ లేదని, అది మారాలంటే సీఎల్‌యూకు దరఖాస్తు చేసుకోవాలం'టూ చాలా మంది నుంచి అనధికారిక వసూళ్లకు తెరలేపారని ఇప్పటికే కొందరు పురపాలకశాఖను ఆశ్రయించినట్టు తెలిసింది. గతంలోనూ కొంత మంది రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి మాస్టర్ ప్లాన్ 2041లో జోన్‌ల మార్పిడి జరిగిందని, ఇందులో భాగంగానే కొన్ని రెసిడెన్షియల్ జోన్లకు దెబ్బపడి ఇళ్లు కట్టుకునేందుకు ప్లాట్ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓవైపు జోన్‌ల అమలుపై అధికారికంగా ఉత్తర్వులు రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఉన్నాయా, లేదా అని దరఖాస్తుదారులు ఆగమాగం అవుతుంటే, అధికారులు మాత్రం తమకు ఇష్టం వచ్చిన తరహాలో వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మీది ఫలానా జోన్‌లో ఉందంటూ మెలిక పెట్టి ఆ తర్వాత మామూలుగా చూసుకుంటే పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ఆధారంగా చేసుకొని కొందరికి అనుమతిలిచ్చారనే ప్రచారం ఉంది. ఇప్పటికైనా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ 2041లో జోన్‌ల అంశంపై దృష్టి సారించి, ఏమైనా అభ్యంతరాలుంటే ప్రజల నుంచి స్వీకరించి మార్పులు చేసి అమలు చేయాలనే డిమాండ్ వస్తోంది. ఈ విషయమై కుడా ఉన్నతాధికారిని వివరణ కోరగా ఇలాంటి అభ్యంతరాలు తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వానికి తెలిపి పరిష్కరిస్తామని చెప్పారు.

ఎక్కడెక్కడ అనుమతివ్వరంటే..

- పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ జోన్ అంటే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక అధికారుల కార్యాలయాలు, చర్చి, దేవాలయం, ప్రార్థనా మందిరం, మసీదు లేదా ఏదైనా ప్రజా ప్రార్థనా స్థలం, ధర్మశాల, కళాశాల, పాఠశాల, లైబ్రరీ వంటి ప్రజలు సాధారణంగా లేదా అప్పుడప్పుడు ఉపయోగించే లేదా ఉద్దేశించిన భవనం, సాంస్కృతిక రంగస్థలం వంటి వాటికి మాత్రమే అనుమతిస్తారు. పబ్లిక్ యుటిలిటీస్ జోన్‌లోనూ నివాసాలకు అనుమతించరు.
- రిక్రియేషనల్ జోన్, ట్రాన్స్ పోర్టేషన్ జోన్, అగ్రికల్చర్ జోన్, హెరిటేజ్ కన్జర్వేషన్ జోన్, ప్రొటెక్టెడ్ అండ్ అన్ డెవలపబుల్ జోన్‌లోనూ నివాసాలను అనుమతించరు. ఇప్పటికే నివాసాలు ఉన్న ప్రాంతాల్లో రెసిడెన్షియల్ కాకుండా ఇతర జోన్‌లుగా మార్పు చేయడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మరోసారి అధ్యయనం చేసి జోన్‌లను మార్చడం వల్ల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందన్న డిమాండ్ వస్తోంది.







రోడ్డు మధ్యనే విద్యుత్ స్తంభాలు

హనుమకొండ వడ్డేపల్లి చర్చి క్రాస్ రోడ్డు నుంచి వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్, నిరూప్ నగర్ మీదుగా జాతీయ రహదారిని కలిపే ఈ రోడ్డును విస్తరిస్తున్నారు. గతంలో వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు వేసిన విద్యుత్ లైన్లు రోడ్డు విస్తరణతో మధ్యలోకి వచ్చి ప్రమాదకరంగా పరిణమించాయి. వేగంగా వచ్చే వాహనాలు ఏ మాత్రం అదుపు తప్పినా.. ఆదమరిచినా విద్యుత్ స్తంభాలకు ఢీకొట్టే అవకాశాలున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని రోడ్డుపక్కకు మార్చాలని కోరుతున్నారు. - హన్మకొండ

విధుల్లో లేకపోతే శాఖాపరమైన చర్యలు

- పారిశుద్ధ్య లోపంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే బాధ్యత
- సకాలంలో భవన నిర్మాణ అనుమతులు జారీ చేయాలి
- గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

వరంగల్ అర్బన్ : క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో లేకుంటే శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లపై చర్యలు తప్పవని గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. కొందరు పర్మనెంట్ పారిశుద్ధ్య కార్మికులు విధులకు రాకున్నా నెల జీతం తీసుకుంటున్న వైనంపై 'పనికి రాకున్నా పక్కాగా జీతం' శీర్షికన ఈనెల 26న సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో కచ్చితంగా 30–40 మంది పారిశుద్ధ్య సిబ్బంది రోజూ విధుల్లో ఉండాలన్నారు. ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు వేసి విధుల్లో లేకుంటే ఉద్యోగంనుంచి తొలగిస్తామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు వారి డివిజన్‌లలో ఎన్ని స్వచ్ఛఆటోలు పనిచేస్తున్నాయో కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం టౌన్ ప్లానింగ్, పన్నుల విభాగం సిబ్బందితో మాట్లాడారు. కమర్షియల్ నిర్మాణాల ఆక్రమణలు, పార్కింగ్ సంబంధ సమాచారంతో ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. ఆక్రమణలు కూల్చివేతలు చేపట్టాలన్నారు. టీఎస్–బీ పాస్ సమాచారం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్‌లు పన్నులను ప్రత్యేక కార్యాచరణకనుగుణంగా వసూళ్లు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్‌లు రవీందర్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బుధవారం రెవెన్యూ (పన్నుల) పరిష్కార మేళా

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయంలో ప్రతి బుధవారం ఉదయం 11 గంటలకు రెవెన్యూ (పన్నుల) పరిష్కార మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో నూతన ఇంటి నిర్మాణం, ఇంటి పన్ను విధింపు, సవరణ, ఇంటి యజమాని పేరు, ఇంటినంబర్ సవరణలు, ఖాళీ స్థలంపై పన్ను విధింపు, ఖాళీ స్థలం పన్నునుంచి ఇంటి పన్నుగా మార్పు వంటి సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

టెన్త్ విద్యార్థులకు స్పెషల్ టెస్టులు

- వందశాతం ఫలితాల సాధనకు కలెక్టర్ ప్రత్యేక కార్యాచరణ
- ప్రీఫైనల్ ముందు ఇలాంటి పరీక్షలు జరపడం ఇదే తొలిసారి
- ఫిబ్రవరి 5నుంచి 12వ తేదీ వరకు నిర్వహణ
- అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలకు వర్తింపు
- మండల అధికారుల పర్యవేక్షణ..
- హనుమకొండ జిల్లాలో 12,330మంది విద్యార్థులు



స్పెషల్ టెస్టుల టైంటేబుల్ ఇలా

ఫిబ్రవరి 5న	ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు, ఉర్దూ, హిందీ)
6న	సెకండ్ లాంగ్వేజ్ (హిందీ, తెలుగు, ఉర్దూ)
7న	ఇంగ్లిష్ (థర్డ్ లాంగ్వేజ్)
8న	మ్యాథమెటిక్స్ (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు)
9న	ఫిజికల్ సైన్స్ (ఉదయం 10నుంచి 11-30గంటల వరకు)
10న	బయోలాజికల్ సైన్స్ (ఉదయం 10నుంచి 11-30గంటల వరకు)
12న	సోషల్ స్టడీస్ (ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు)

విద్యారణ్యపురి: పదో తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18నుంచి జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధికా గుప్తాలు జిల్లాలో ఈసారి వందశాతం ఫలితాలు సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. దిశగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని టెన్త్ విద్యార్థులకు ఇటీవల స్లిప్ టెస్టులు నిర్వహించారు. అందులో విద్యార్థులు సాధించిన మార్కులపై ఈ నెల 27న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, డీఈఓతో సహా హెచ్ఎంలతో సమీక్షించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థుల ప్రగతి తెలుసుకునేందుకు అన్ని సబ్జెక్టులకు స్పెషల్ టెస్ట్‌లు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ స్పెషల్ టెస్ట్‌లు రాయాల్సిఉంటుంది. ఈ పరీక్షలను ఫిబ్రవరి 5వ తేదీనుంచి 12వ తేదీ వరకు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించారు.

ఫిబ్రవరి 5నుంచి..

ఈ విద్యాసంవత్సరంలో అన్ని యాజమాన్యాల (ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, గురుకులాల)టెన్త్ విద్యార్థులకు ఇప్పటికే సమ్మేటివ్ 1 పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతి సబ్జెక్టులో సగం సిలబస్‌తో కూడిన ప్రశ్నపత్రాలు ఇచ్చారు. వాటిని మూల్యాంకనం చేసి విద్యార్థుల ప్రగతి ఎలా ఉందో తెలుసుకున్నారు. మిగతా సగం సిలబస్ పూర్తయినందున ఆ సిలబస్‌తో టెన్త్ విద్యార్థులందరికీ ఫిబ్రవరి 5నుంచి స్పెషల్ టెస్టు పేర పరీక్షలు నిర్వహించబోతున్నారు. అందుకు జిల్లా పరీక్షల బోర్డు అన్ని సబ్జెక్టుల ప్రశ్నపత్రాలు రూపొందించింది. రోజుకో సబ్జెక్టు చొప్పున వార్షిక పరీక్షల మోడల్‌లో నిర్వహించబోతున్నారు. దీనిని మినీ ప్రీఫైనల్ పరీక్షలుగా భావిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 12,033మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయబోతున్నారు. ఆయా హైస్కూళ్లలో స్పెషల్ టెస్టు నిర్వహణ తీరును ఎంపీడీఓలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంఈఓలు పర్యవేక్షించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆయా అధికారులకు జిల్లా అదనపు కలెక్టర్ బాధ్యతలు కూడా అప్పగించారని తెలుస్తోంది. జవాబుపత్రాల మూల్యాంకనం తరువాత ఆయా విద్యార్థుల ప్రగతి ఎలా ఉందో కూడా సమీక్షించే అవకాశం ఉంది. ప్రీఫైనల్ పరీక్షలకు ముందు స్పెషల్ టెస్టు నిర్వహించడం జిల్లాలో తొలిసారి కావడం గమనార్హం.

ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

- ఒక్క టౌన్‌ప్లానింగ్‌కే 52 వినతులు
- కాలనీల్లో మౌలిక వసతులు కల్పించండి
- గ్రీవెన్స్ లో విజ్ఞప్తులు స్వీకరించిన కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

వరంగల్ అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేని భవన నిర్మాణాలపై గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్ సెల్‌కు వెల్లువలా ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. కమిషనర్ బాషా, వింగ్ అధికారుల సమక్షంలో నగరవాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 103 ఫిర్యాదులు రాగా, అందులో టౌన్ ప్లానింగ్‌కు 52 రావడం గమనార్హం. ఇంజనీరింగ్ విభాగానికి 27, హెల్త్– శానిటేషన్ 9, ప్రాపర్టీ టాక్స్ (రెవెన్యూ)15 ఫిర్యాదులు అందాయి. కనీస మౌలిక వసతులు కల్పించాలని పలు కాలనీల ప్రజలు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్‌లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్ఓ రాజేష్, సిటీ ప్లానర్ వెంకన్న, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, హెచ్ఓ రమేష్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డి, రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- శివనగర్ మెట్టుబావి వద్ద 30 ఫీట్ల రోడ్డును విస్తరించాలని, ఆక్రమణలను తొలగించాలని కాలనీవాసులు వినతిపత్రం సమర్పించారు.
- 27వ డివిజన్ గిర్మాజీపేటలో ఇరుకు రోడ్లను వెడల్పు చేయాలని, డ్రెయినేజీలు నిర్మించి, ఇనుప స్తంభాల స్థానంలో సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని ఎ.రాఘవరావు కోరారు.
- 19వ డివిజన్ అజంజాహి మిల్లు వర్కర్స్ యూనియన్ భవనస్థలంలో బల్దియా మంజూ రు చేసిన అనుమతి ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకుడు రాజేష్ విన్నవించారు.
- కేఎంసీ ఎదురుగా డ్రెయినేజీ స్తంభించిపోయి దుర్వాసన వెదజల్లుతుందని, చర్యలు తీసుకోవాలని కె.రవి ఫిర్యాదు చేశారు.
- 10వ డివిజన్‌లోని రామకృష్ణ కాలనీలో ఎఫ్‌టీఎల్ పరిధిలో భారీ భవంతులు నిర్మిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు విన్నవించారు.
- వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సర్వేనంబర్ 280/సి భూమికి అడ్డంగా మార్కెట్ అధికారులు ప్రహరీ, నిర్మించారని చర్యలు తీసుకోవాలని కోరారు.
- హనుమకొండ గోకుల్‌నగర్ నాలాపై అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని కాలనీవాసులు విన్నవించారు.
- 57వ డివిజన్ హనుమకొండ వంద ఫీట్ల కూడా ఇన్‌క్లెవ్ ఎస్‌పీఆర్ స్కూల్ వద్ద డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- 56వ డివిజన్ అమరావతి నగర్ 100 ఫీట్ల రోడ్డులో డ్రెయినేజీ నిర్మాణం లేక రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు.
- నయీంనగర్‌లో పబ్లిక్ రోడ్డును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని నిర్మాణం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- కాపువాడ మున్నూరుకాపు శ్మశానవాటికకు మంజూరైన పనులు చేపట్టాలని కాపువాడ సేవా సంఘం ప్రతినిధులు అర్జీ సమర్పించారు.
- 61వ డివిజన్ కాజీపేట 60 ఫీట్ల మాస్టర్ ప్లాన్ రోడ్డును భూకబ్జాదారుల నుంచి కాపాడాలని ప్రశాంత్ నగర్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు విన్నవించారు.
- హనుమకొండ టీచర్స్ కాలనీ ప్రగతిమిత్రలో సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీ కమిటీ ప్రతినిధులు సూచించారు.

1నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

విద్యారణ్యపురి : ఇంటర్ విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీ(గురువారం) నుంచి ప్రాక్టికల్స్ పరీక్షలు జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలను ఉంటాయని అందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హనుమకొండ డీఐఈఓ ఎ.గోపాల్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 86 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇంటర్ జనరల్, ఒకేషనల్ మొదటి, రెండో సంవత్సరం కలిపి మొత్తంగా 13,768మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలు రాయబోతున్నారు. కాగా పరీక్షల నిర్వహణకు ఇంటర్‌బోర్డు ఆన్‌లైన్‌లోనే కేంద్రాలకు ప్రశ్నపత్రాలను పంపనున్నదని డీఐఈఓ గోపాల్ తెలిపారు.కాగా థియరీ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19వ తేదీవరకు ఉంటాయన్నారు.

ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్

హన్మకొండ అర్బన్: ఫిబ్రవరిలో జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు ఆయా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 86 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఐఈఓ గోపాల్ మాట్లడుతూ ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు ఒకటి, రెండు రోజుల విడతలుగా ఉంటాయని వివరించారు. సమావేశంలో డీఆర్ఓ వై.వి గణేష్, సీఐ శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్ఓ సాంబశివరావు, అధికారులు ధరమ్‌సింగ్, హరికృష్ణ, అశోక్, డీపీఓ సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్చి 16న ఎస్సార్ స్నాతకోత్సవం



హసన్‌పర్తి: ఎస్సార్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ వేడుకలు మార్చి 16వ తేదీన నిర్వహించనున్నారు. ఈమేరకు సోమవారం యూనివర్సిటీలో కాన్వొకేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ గురురావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వేడుకలను పురస్కరించుకుని భారీ ప్రదర్శన, డిగ్రీ, గౌరవ డాక్టరేట్ల ప్రదానం, ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులకు సన్మానం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చాయి. స్నాతకోత్సవానికి నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరం చైర్మన్ అనిల్‌ను ఆహ్వానించనున్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, డాక్టర్ సుమన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రీసెర్చ్ ఎనలిస్టుల ఎంపికకు నేడు ప్రాంగణ నియామకాలు

కేయూ క్యాంపస్: హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న 'లుర‌స్ ల్యాబ్స్'లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో పనిచేసేందుకుగాను రీసెర్చ్ ఎనలిస్టుల ఎంపిక కోసం మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి కాకతీయ యూనివర్సిటీలోని కెమిస్ట్రీ విభాగం సెమినార్‌హాల్‌లో ప్రాంగణ నియామకాలు నిర్వహించనున్నట్లు ఆ విభాగం అధిపతి టి. సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 విద్యాసంవత్సరాల్లో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ పూర్తిచేసిన, పూర్తిచేయబోతున్న విద్యార్థులు, అలాగే ఎంఫార్మసీ క్వాలిటీ అనలిటిక్స్/ఫార్మా అనలటిక్స్ విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్ కేంద్రంగా విధులు నిర్వర్తించాల్సింటుందన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2 లక్షల 50 వేలు ఉంటుందన్నారు. ఆయా అభ్యర్థులు తమ బయోడేటా, పాస్ పోర్టుసైజ్ ఫొటో,అకడమిక్ ధ్రువపత్రాలతో సంబంధిత కళాశాల గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. వివరాలకు ప్లేస్‌మెంట్ సెల్ బాధ్యులు బి. కిరణ్‌కుమార్, వి. రమణబాబును సంప్రదించాలని ఆమె సూచించారు.

నేటినుంచి కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైళ్లు



కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ నుంచి మంగళవారం కాజీపేట-అయోధ్య ప్రత్యేక రైలు సర్వీస్‌లు నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. జనవరి 30వ తేదీ సాయంత్రం 6.20 గంటల నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు కాజీపేట-అయోధ్య (07223) ప్రత్యేక రైళ్ల సర్వీస్‌లు నడవనున్నాయి. కాగా, కాజీపేట-అయోధ్య మధ్య 15 రైళ్ల సర్వీస్‌లు నడవనున్నాయి. అదేవిధంగా అయోధ్య- కాజీపేట (07223) ప్రత్యేక రైలు ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు రాత్రి 9 గంటలకు కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటుంది. కాగా,అయోధ్య- కాజీపేట మధ్య 15 రైళ్ల సర్వీస్‌లు నడవనున్నాయి

ఎవరిని వరించేనో?

ఎన్పీడీసీఎల్‌లో నలుగురు డైరెక్టర్ల తొలగింపు

- నూతన డైరెక్టర్ల నియామకానికి కసరత్తు
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ మండలిలో (టీఎస్ ఎన్పీడీసీఎల్) డైరెక్టర్ల నియామకానికి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది. కాగా, ప్రస్తుతం డైరెక్టర్లుగా కొనసాగుతున్న వారిని తొలగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో కొనసాగుతున్న నలుగురు డైరెక్టర్లు పదవులు కోల్పోయారు. దీంతో ఐదు నుంచి పదేళ్లకు పైగా డైరెక్టర్లుగా కొనసాగుతున్న వారి సేవలకు ముగింపు పలికినట్లైంది. డైరెక్టర్ (హెచ్‌ఆర్) బి.వెంకటేశ్వర్ రావు 2013 జూలై 31 నుంచి 10 సంవత్సరాల 5 నెలలుగా పదవిలో కొనసాగుతున్నారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) పి.మోహన్ రెడ్డి, డైరెక్టర్ (కమర్షియల్) పి.సంధ్యారాణి, డైరెక్టర్ (ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ) పి.గణపతి 2018 సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 5 సంవత్సరాల 4 నెలలుగా పదవిలో కొనసాగుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి డైరెక్టర్‌ను 2 సంవత్సరాల కాల పరిమితితో నియమించాలి. మరో రెండు సంవత్సరాల పొడిగించే అవకాశముంది. అయితే ప్రస్తుత డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా నాలుగు సంవత్సరాలకు పైగా కొనసాగుతున్నారు. నిబంధనలు పరిశీలించి వీరిని తొలగించినట్లు ఆ ఉత్తర్వులో పేర్కొంది.

నోటిఫికేషన్ రూపకల్పనలో అధికారులు నిమగ్నం..

టీఎస్ ఎన్పీడీసీఎల్‌కు నూతన డైరెక్టర్ల ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే వీరి నియామకం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని డిస్కం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌కు సూచించింది. అదే విధంగా నిబంధనల మేరకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించింది. దీంతో టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం నూతన డైరెక్టర్ల నియామక ప్రక్రియకు చర్యలు తీసుకుంటోంది. నిబంధనలు, జీఓల ప్రకారం నోటిఫికేషన్ రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎంత మంది డైరెక్టర్లను నియమిస్తారు..? ఎవరు అర్హులనే అంశాలు నోటిఫికేషన్ జారీతో తెలిసే అవకాశముంది. అయితే గతంలో టీఎస్ ఎన్పీడీసీఎల్ ఖాళీగా ఉన్న ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టులో చీఫ్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్‌ను ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా నియమించారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్‌తో కలుపుకుని ఐదుగురు ఉండగా ఇన్‌చార్జ్ డైరెక్టర్‌ను మినహాయించి పూర్తి స్థాయి డైరెక్టర్లుగా కొనసాగుతున్న నలుగురిని ప్రభుత్వం తొలగించింది. అయితే డైరెక్టర్ పదవులు ఆశిస్తూ ఇప్పటికే పలువురు చీఫ్ జనరల్ మేనేజర్లు ఇంధన శాఖకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలని సూచించడంతో వీరితో పాటు మరికొందరు సీజీఎంలు డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు పోటీపడుతున్నారు.

కొందరు డైరెక్టర్లు అత్యుత్సాహం..

ఇదిలా ఉండగా గత డైరెక్టర్లలో కొందరు అత్యుత్సాహం చూపారని, క్షేత్రస్థాయి స్థాయి అధికారులు, ఉద్యోగులను చిన్న చూపు చూశారని వారి తీరును విద్యుత్ ఉద్యోగ వర్గాలు తప్పుబడుతున్నాయి. సీఎండీ వద్ద మెప్పు కోసం పాకులాడారని, చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తున్న వారిపై చాడీలు చెప్పి తప్పుదోవ పట్టించారని అసహనం వ్యక్తం చేశారు. సీఎండీ వద్ద మెప్పు కోసం ఇతరులను బలి చేయడం ఎంత వరకు సమంజసమని వారి తీరును ప్రశ్నించారు. వారిని పదవుల నుంచి తొలగించడంతో ఈ ఉద్యోగ వర్గాలు సంతోషం వ్యక్తం చేశాయి. క్షేత్రస్థాయి ఉద్యోగులను ప్రోత్సహించేలా డైరెక్టర్ల వైఖరి ఉండాలని, కక్ష సాధింపు విధానాలు అవలంబించడం మంచిది కాదని ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి.

ఒకే ఊరి నుంచి ఆరుగురికి ఉద్యోగం..



యానాల రాజీవ్‌రెడ్డి-సత్యపావని, పసునాది వీరేష్-సౌజన్య, చిప్పరపల్లి ఉమ, మాచర్ల లక్ష్మి

- స్టాఫ్‌నర్స్ పోస్టుకు కొత్తూరు(సీ) వాసుల ఎంపిక
- అభ్యర్థులను అభినందించిన గ్రామస్తులు

కురవి: ఓ ప్రభుత్వ ఉద్యోగానికి ఒకే ఊరు నుంచి ఆరుగురు అభ్యర్థులు ఎంపిక కావడం.. ఇందులో రెండు జంటలుండడం (దంపతులు) విశేషం. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలంలోని కొత్తూరు(సీ) గ్రామానికి చెందిన ఆరుగురు అభ్యర్థులు స్టాఫ్‌నర్స్ ఉద్యోగానికి ఎంపికై సత్తాచాటారు. ఆదివారం సాయంత్రం స్టాఫ్‌నర్స్ ఉద్యోగాల ఫలితాలు వెల్లడి కాగా సోమవారం వీరిని గ్రామస్తులు అభినందించారు. గ్రామానికి చెందిన యానాల రాజీవ్‌రెడ్డి-సత్యపావని, పసునాది వీరేష్-సౌజన్య దంపతులు, మాచర్ల లక్ష్మి, చిప్పరపల్లి ఉమ ఉద్యోగం సాధించారు. యానాల రాజీవ్‌రెడ్డి-సత్యపావని, పసునాది వీరేష్-సౌజన్య దంపతులు వివిధ ఆసుపత్రుల్లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు. వీరితోపాటు కురవి, సీరోలు మండలంలోని తట్టుపల్లిలో కట్ల కవిత, కురవిలో చిలకబత్తిని జ్యోతి, బలపాలకు చెందిన దేవులపల్లి హేమలత, ఉప్పరిగూడేనికి చెందిన గంట వరలక్ష్మి, మోద్గులగూడేనికి చెందిన దుంద్ర భవానీ ఉద్యోగాలు సాధించారు.

టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాల భర్తీకి సిద్ధం

- కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్



మాట్లాడుతున్న పోరిక బలరాంనాయక్

ములుగు : టీఎస్‌పీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. మాజీ డీజీపీ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన ఏ హామీ పూర్తిగా అమలు కాలేదని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. జీఎస్టీతో కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులు, పెట్రోల్ రేట్లు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, వెంటకటాపూరం(ఎం), గోవిందరావుపేట మండలాల అధ్యక్షులు చెన్నోజు సూర్యనారాయణ, పాలడుగు వెంటకనారాయణ, కాశిందేవిపేట సర్పంచ్ అహ్మద్‌పాషా, ఇమ్మడి రాజు, విజేందర్, షర్పొద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

- ప్రభుత్వంపైనే దృష్టి సారించాం.. పార్టీని పట్టించుకోలేదు
- వరంగల్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురవేయాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హసన్‌పర్తి : ప్రజలు మార్పు కోరుకోవడం వల్లే బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నగరంలోని సీఎస్‌ఆర్ గార్డెన్‌లో జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఓటమికి ఉద్యోగులు, నిరుద్యోగులతో పాటు సోషల్‌మీడియా ద్వారా జరిగిన దుష్ప్రచారమే కారణమన్నారు. దుష్ప్రచారం వల్లే ప్రజలు బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారని చెప్పారు. పదేళ్ల హయాంలో బీఆర్‌ఎస్ పార్టీ 1.60 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజులు గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదని, అందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వంపైనే దృష్టి సారించాం..

ఐదేళ్ల కాలంలో ప్రభుత్వంపైనే దృష్టి సారించామని, పార్టీపై దృష్టిని కేంద్రీకరించలేదన్నారు. 14 స్థానాల్లో అత్యల్ప మెజార్టీతోనే ఓటమి చెందినట్లు నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకుంటామన్నారు. రామమందిరం అక్షింతలతో బీజేపీ రాజకీయం చేస్తోందని విమర్శించారు. త్వరలో జరగనున్న లోక్ సభ ఎన్నికల్లో వరంగల్ సీటుపై గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

క్యాడర్ బలంగా ఉన్నా ఓటమి..

జిల్లాలో పార్టీ క్యాడర్ బలంగా ఉన్నా పదిస్థానాల్లో ఓటమి పొందడం విచారకరమని మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నారు. పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ దయాకర్, డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, జెడ్పీటీసీలు సునీత, మార్గం భిక్షపతి, ఎంపీపీలు సునీత, మధుమతి, అప్పారావు, పంతులు, కార్పొరేటర్ రజిత, సునీల్, దివ్యరాణి, జన్ను షిబారాణి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి ఆర్టీసీ బస్సు



రోడ్డు డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్సు

ఆలేరు రూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు శివారులోని హైదరాబాద్ - వరంగల్ రహదారిపై కందిగడ్డతండా శివారులో సోమవారం జనగామ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళుతున్న బస్సు కందిగడ్డతండా సమీపంలోకి రాగానే అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో మొత్తం 40 మంది ప్రయాణికులు ఉన్నారు.

గంజాయి పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ రామకృష్ణ

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ పోలీసులు సోమవారం రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి గ్రామానికి చెందిన బరుపాటి చంద్రారెడ్డి తన ఇంట్లో గంజాయి నిల్వ ఉంచాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించగా రెండు కిలోల గంజాయి లభించింది. దీంతో గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రమ్య, సిబ్బంది రమేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

కాటారం: కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ విద్యార్థిని.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం కాటారం మండలం దామెరకుంటలో జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జిల్లెల నందిని(17) ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో కడుపు నొప్పి భరించలేక ఈ నెల 28వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివిధ కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వివిధ కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సోమవారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహబూబాబాద్ మండలం మొట్లతండాలో మహిళ, వెంకటాపురం(ఎం) మండలం గుంటూరుపల్లిలో యువకుడు, రేగొండ మండలం రేపాక గ్రామంలో వృద్ధురాలు బలవన్మరణాలకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.



పద్మ మృతదేహం

మహబూబాబాద్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ మహిళ.. బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ మండలం మొట్లతండా గ్రామంలో జరిగింది. రూరల్ రెండో ఎస్సై డి.కుమారస్వామి కథనం ప్రకారం.. మొట్లతండా గ్రామ సర్పంచ్ బానోత్ సుమన్ భార్య సరిత కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందింది. ఈ సమయంలో సుమారు రూ. 7 లక్షల వరకు ఖర్చు అయింది. ఫలితంగా ఆ కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. దీంతో సుమన్ తల్లి పద్మ (50) అప్పటి నుంచి మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో ఆదివారం స్థానిక రైతు గుగులోత్ నీలమ్మ చేను వద్దకు కూలీ పనికి వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు తండావాసులు.. పద్మ కోసం వెతకగా ఆమె ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం భూక్య బాషా ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. స్థానికులు వెళ్లి చూసి పద్మగా గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా రూరల్ రెండో ఎస్సై డి.కుమారస్వామి, ఏఎస్సై పెద్దిరెడ్డి రమేష్, పీసీ మల్లం సంతోష్ ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబీకులకు అప్పగించారు. మృతురాలి కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ రెండో ఎస్సై తెలిపారు.

గుంటూరుపల్లిలో యువకుడు..

వెంకటాపురం(ఎం): ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గుంటూరుపల్లిలో జరిగింది. వెంకటాపురం ఎస్సై చల్లా రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నవేన రాజు(25)కు రామాంజాపూర్‌కు చెందిన కావ్యశ్రీతో నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి దాంపత్య జీవితంలో ఒక పాప జన్మించగా, పాపకు అనారోగ్యం కారణంగా కొంత అప్పు అయింది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న క్రమంలో ఆరు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజు కాలు విరిగింది. చికిత్స కోసం రాజు మరింత అప్పు చేయడంతో పాటు కుటుంబపోషణ భారంగా మారింది. దీంతో మనస్తాపానికి గురైన రాజు సోమవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

రేపాకలో వృద్ధురాలు..

రేగొండ: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం మండలంలోని రేపాకలో జరిగింది. గ్రామానికి చెందిన ఇండ్ల కొమురమ్మ (65) కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పలు ఆసుపత్రుల చుట్టు తిరిగినా నయం కావడం లేదు. దీనిపై మనస్తాపం చెందిన కొమురమ్మ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి కుమారుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు.

'కత్తెర' కాటు..

పాడి-పంట

మొక్కజొన్నను ఆశిస్తున్న పురుగు

- అన్నదాతలకు అపార నష్టం
- నివారణ చర్యలపై రైతులకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు



మొక్కజొన్న పంటను ఆశించిన కత్తెర పురుగు



మహబూబాబాద్ రూరల్ : వానాకాలం, యాసంగి సీజన్లలో రాష్ట్రంలో సుమారు 14 లక్షల ఎకరాల్లో సాగవుతున్న పంట మొక్కజొన్న. అయితే ఈ మధ్య కాలంలో ఈ పంటను కత్తెర పురుగు ఆశించి అపార నష్టం కలుగజేస్తోంది. దేశంలో లద్దె పురుగు జాతికి చెందిన కత్తెర పురుగును 2018లో మొదటిసారి మొక్కజొన్న పంటలో గుర్తించారు. ఈ కత్తెర పురుగు పంట తొలిదశ నుంచే ఆశిస్తుంది. దీనిపై సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో నష్టం ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, క్రాప్ ప్రొటెక్షన్ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్ అన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యల గురించి వారు 'సాక్షి'కి తెలిపారు.

పురుగు లక్షణాలు..

తొలిదశ లార్వాలు లేత ఆకుపచ్చని శరీరంతో నల్లనితల కలిగి ఉంటాయి. అలాగే ఎదిగిన లార్వాలు ముదురు గోధుమ రంగులో ఉండి తలపై తెల్లని తలక్రిందులుగా ఉన్న వై ఆకారపు గుర్తు కలిగి ఉంటాయి. లార్వాలపై నల్లని చుక్కల వరుసలు ఉండి తోకవైపు నల్లని చుక్కలు చతురస్రాకారంలో ఉంటాయి. ఈ పురుగు జీవిత చక్రం 34 నుంచి 36 రోజులలో పూర్తవుతుంది.

నష్టపరిచే విధానం..

పురుగులు పత్ర హరితాన్ని గీకి తినడం వల్ల ఆకులపై తెల్లటి పొరలు ఏర్పడతాయి. ఆకుని తొలుచుకుని తిని, సుడిలోకి ప్రవేశిస్తాయి. అలాగే, ఆకు సుడిలో రంధ్రాలు చేసి తింటాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే గొడ్డు మొక్కలు ఏర్పడతాయి.

సస్యరక్షణ చర్యలు :

- సామూహికంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పైరు 30 రోజుల దశ వరకు ఎకరానికి 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి.
- లోతైన దుక్కులు దున్నుకోవాలి.
- రైతులు సామూహికంగా పంటను సాగు చేయాలి.
- సయాంట్రానిలిప్రోల్ 19.8% తోపాటు థయామిథాక్సాం 19.5% ఎఫ్.ఎస్ 6 మిల్లీ లీటర్లు మందును విత్తన శుద్ధికి వినియోగించాలి.
- మొక్కజొన్నలో అంతర్‌పంటగా కందిని సాగు చేయాలి.
- ఎరువుల మోతాదు తక్కువగా వినియోగించాలి.
- మొదటి దశ పిల్ల పురుగులకు అజాడిరక్టిన్ (వేప నూనె) 1500 పీపీఎం 5 మిల్లీ లీటర్లను పిచికారీ చేయాలి.
- రెండో దశ దాటిన లార్వాల కోసం ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములతోపాటు స్పైనిటోరం 0.5 మిల్లీ లీటర్ల మందు పిచికారీ చేయాలి.
- అదే 20 నుంచి 30 రోజుల పంట కాలమైతే క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మిల్లీ లీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే, ఎదిగిన లార్వాలకు ఇండాక్స్ కార్బ్ ఒక మిల్లీ లీటర్‌ను లీటర్ నీటికి పిచికారీ చేసుకోవాలి.
- పంట దశ 31 నుంచి 65 రోజులకు తిరిగి ఇమామేక్టన్ బెంజోఎట్ 0.4 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పంట దశ 65 రోజులకు చేరిన సమయంలో పురుగు మందులు సరిగ్గా పనిచేయవు. అందుకే ముందస్తు అన్ని సస్యరక్షణ చర్యలు తీసుకోవడం ఉత్తమం.

పాపం పండుటాకులు..

- తల్లిదండ్రులను చేరదీయని కుమారులు..
- రోడ్డున పడిన వృద్ధ దంపతులు
- న్యాయం కోసం ఎదురుచూపులు



వెంకన్న, సారమ్మ దంపతులు



గ్రామ శివారు వారు ఉంటున్న గుడిసె

నెల్లికుదురు : నవమాసాలు మోసి కని, పెంచి పెద్ద చేసిన ఆ తల్లిదండ్రులు.. పుత్రులకు బరువయ్యారు. వృద్ధాప్యంలో తల్లింద్రులను కంటికిరెప్పలా కాపాడుకుంటూ చేరదీయాల్సిన ముగ్గురు కుమారులు కాదు పొమ్మంటున్నారు. దీంతో ఆ వృద్ధ దంపతులు రెండేళ్ల నుంచి గ్రామ శివారులో గుడిసె వేసుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, పోలీసులు ఎవరూ ఆ పండుటాకులకు న్యాయం చేయలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో తమపై కుమారులు దాడి చేయడానికి కూడా వెనుకాడడం లేదని ఆ వృద్ధ దంపతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం గ్రామానికి చెందిన గుండ వెంకన్న, సాలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరందరికీ పెళ్లిళ్లు చేసి ప్రయోజకులను చేశారు. కాయ కష్టం చేసి ఎనిమిది ఎకరాల వ్యవసాయ భూమి సంపాదించారు. ముగ్గురు కుమారులకు సామానంగా రెండు ఎకరాల భూమి వారి పేరుమీద పట్టా చేయించి దంపతులు రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే వారి భూమి కూడా కుమారులే తీసుకుని సాగు చేసుకుంటూ కౌలు కూడా ఇవ్వడం లేదు. ఈ విషయంపై పెద్ద మనుషులు, పోలీసు స్టేషన్ చుట్టు తిరిగినా వారికి న్యాయం జరగడం లేదు. 'మా కొడుకులు పెద్దమనుషుల వద్దకు రావడం లేదు. మమ్మల్ని పట్టించుకోవడం లేదు. కుల పెద్దల వద్దకు కూడా రావడం లేదు' అని వృద్ధ దంపతుల కన్నీరుమున్నీరవుతున్నారు. చేసేది ఏమీలేక గ్రామ శివారులో గుడి పక్కన ఉన్న వ్యవసాయ భూముల వద్ద గుడిసె వేసుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ రెండు ఎకరాల భూమి తమకు ఇప్పించడంతోపాటు తమ సొంత స్థలంలోనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు వేడుకుంటున్నారు.